
డీఎంహెచ్ఓ వెంకటికి వినతిపత్రం అందజేస్తున్న పీవైఎల్ నేతలు

ఫర్టిలిటీ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి

● పీవైఎల్ నేతల డిమాండ్

నల్లకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసం చేస్తున్న ఫర్టిలిటీ కేంద్రాలను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పీవైఎల్ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పీవైఎల్ నేతలు డీఎంహెచ్ఓ వెంకటిను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం పీవైఎల్ నగర అధ్యక్షుడు బీఎస్. కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడారు. ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని రాష్ట్రంలో ఫర్టిలిటీ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని వారు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఫర్టిలిటీ కేంద్రాలపై రాష్ట్ర వైద్యారోగ్యా శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పీవైఎల్ నాయకులు రవి, రాంబాబు, సాయి, గణేశ్, నాగేశ్వరరావు, రాము, నాగయ్య పాల్గొన్నారు.

ఆజాద్‌నగర్ అభివృద్ధికి కృషి

● కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్


ఆజాద్‌నగర్‌లో తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆజాద్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ప్రజలకు హామీనిచ్చారు. డివిజన్‌లోని ఆజాద్‌నగర్‌లో బుధవారం ఆయన పర్యటించారు. కాలనీలో తాగునీటి లోప్రెషర్ సమస్య ఉందని కార్పొరేటర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన మంచినీటి వాల్ ఏర్పాటు ద్వారా లోప్రెషర్ సమస్య పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనతరం బాపునగర్, చెన్నారెడ్డినగర్‌లో పర్యటించారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లను తొలగించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రదీప్, బతుకమ్మకుంట ఏఈఈ శీనయ్య, ఏఈ శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్‌ముదిరాజ్, ఉదయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ

కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి

● జీఎంకు కాంగ్రెస్ నేతల వినతి

చిక్కడపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో మంచినీటి సరఫరాలో లోప్రెషర్, కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం వాటర్‌వర్క్స్ డివిజన్- 5 జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన జీఎం సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపడుతామని హామీనిచ్చారని అభిషేక్ కెన్నడీ తెలిపారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి


సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఈ వ్యాధుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి సూచించారు. మౌలానా ఆజాద్‌నగర్‌లోని బస్తీ దవాఖానాలో బుధవారం జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బస్తీ దవాఖానాలో మందులు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పద్మ, మనోజ్‌రెడ్డి, మహేముల్, మౌనిక, నర్సులు కీర్తి, వంశీ, బీజేపీ నాయకులు భీమ్‌రాజ్, రవియాదవ్, రామకృష్ణ పాల్గొన్నారు.

గౌరీ శంకర ఆలయ హుండీ లెక్కింపు

ముషీరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని గౌరీ శంకర ఆలయ హుండీ కానుకలను బుధవారం ఆలయ ఈఓ శ్రీనివాస్‌లు, ఇన్‌స్పెక్టర్ అండాలు పర్యవేక్షణలో లెక్కించారు. మూడు నెలలకు గాను 13 గ్రాముల బంగారం, 5 తులాల వెండి, రూ.30,213 నగదు వచ్చాయని ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీధర్‌చారి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సర్వేశ్వర్, భరత్‌శర్మ, కృపాకర్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బోనాల వేడుకల్లో పాల్గొన్న శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

చిక్కడపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు అని తెలంగాణ జనసమితి ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన బోనాల వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, జైరు బాయ్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

యాదమ్మ సేవలు మరువలేనివి

చిక్కడపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సంఘ సేవకురాలు యాదమ్మ సేవలు మరువలేనివని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ నివాసి అబ్రహాం సతీమణి యాదమ్మ సంస్మరణ సభ జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం జరిగింది. బీజేపీ నేతలు ఉమేష్, యాకూబ్, మీనా, సంధ్య, సరిత, ఎల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్టళ్లలో ఇష్టారాజ్యం

- నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- వేలల్లో ఫీజులు.. అరకొర వసతులు
- భద్రత పట్టని అధికారులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



జవహర్‌నగర్‌లోని హాస్టల్ భవనాలు

చిక్కడపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రైవేట్ హాస్టళ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. భవిష్యత్తును బంగారుమయం చేసుకోవడానికి నిరుద్యోగులు, ఉన్నత చదువుల కోసం విద్యార్థులు, బతుకుదెరువు కోసం ఉద్యోగం చేయడానికి కొందరు నగరానికి వస్తూ హాస్టళ్లలో జీవిస్తుంటారు. ముఖ్యంగా ముషీరాబాద్‌లో నిరుద్యోగులు ఎక్కువగా ఉంటారు. వారిని ఆసరగా చేసుకున్న కొందరు హాస్టల్ యజమానులు ఎలాంటి నిబంధనలు పాటించకుండానే ఇష్టారీతిన నడిపిస్తున్నారు. వేలల్లో ఫీజులు తీసుకుంటున్న నిర్వాహకులు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. హాస్టల్ భద్రతపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది.

300కి పైగా హాస్టళ్లు..

నగరం నడిబొడ్డున ఉన్న ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం గాంధీనగర్ మున్సిపల్ డివిజన్‌లోని ఆర్టీసీక్రాస్‌రోడ్, గోల్కొండచౌరస్తా, గాంధీనగర్, వివేక్‌నగర్, అశోక్‌నగర్, చిక్కడపల్లి, జవహర్‌నగర్, ప్రాంతాల్లో దాదాపు 300కు పైగా హాస్టళ్లు, స్టడీ హాళ్లు ఉన్నాయి. ఇందులో ప్రముఖ వ్యక్తులు అద్దె ఎక్కువగా వస్తుందనే ఆశలో తమ భవనాలను హాస్టళ్లకు అద్దెకిచ్చారు. ఓ మాజీ ప్రభుత్వ అధికారికి ఈ ఏరియాలో కనీసం పది భవనాలు ఉన్నాయి. అశోక్‌నగర్ ప్రాంతంలో ఉన్న వివిధ కోచింగ్ సెంటర్లలో ఉద్యోగ పరీక్షల కోసం కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు, యువతీయువకులు చాలా మంది సమీపంలో ఉన్న హాస్టళ్లలో నివాసం ఉంటున్నారు. వారి వద్ద వేలల్లో ఫీజులు తీసుకుంటున్న నిర్వాహకులు సరైన భోజనం అందించడం లేదు. వారికి సంబంధించిన రిజిష్టర్ మెయింటెన్ చేయడం లేదు. కనీసం విద్యార్థులు ఫీజు కడితే రిసిప్ట్ కూడా ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హాస్టళ్లలో ఫైర్‌సేఫ్టీ కూడా లేదు. హాస్టళ్ల వద్ద కనీసం పార్కింగ్ చేసుకోవడానికి స్థలం కూడా లేని పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి హాస్టళ్లను తనిఖీ చేయాలని, నిబంధనలు పాటించని హాస్టళ్లను సీజ్ చేయాలని పలువురు కోరుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు తరచుగా హాస్టళ్లను తనిఖీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవట్లే



హాస్టల్ నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. ఇటీవల అశోక్‌నగర్ చౌరస్తాలోని ఓ హాస్టల్‌లో ఓ విద్యార్థిని, వివేక్‌నగర్‌లో మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయినా హాస్టళ్ల నిర్వహణపై అధికారులు తనిఖీ చేయకపోవడం శోచనీయం. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వంలో, అధికారుల్లో చలనం లేదు. నివాస భవనాలను హాస్టళ్లుగా ఎలా మారుస్తున్నారనే విషయంపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- పావని వినయ్‌కుమార్, గాంధీనగర్ కార్పొరేటర్

హాస్టళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి



హాస్టళ్లలో నివాసం ఉండడానికి వచ్చే వారి నుంచి తప్పనిసరిగా నిర్వాహకులు ఆధార్‌కార్డులు తీసుకోవాలి. వారి కదలికలపై తరచుగా నిఘా ఉంచాలి. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడినట్లు అనుమానాలు వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. ముఖ్యంగా హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. గతంలో పలుమార్లు పలు హాస్టల్ నిర్వాహకులతో సమావేశాలు కూడా నిర్వహించి జాగ్రత్తలు సూచించాం.

- రాజునాయక్, చిక్కడపల్లి లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్

హాస్టళ్లతో స్థానికులకు ఇక్కట్లు



అశోక్‌నగర్, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్లతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. వందలాది హాస్టళ్లు ఉన్న చోట ఎలాంటి ఇబ్బందులు రాకుండా అటు మున్సిపల్, ఇటు లా అండ్‌ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి.

- రాకేశ్‌కుమార్, జవహర్‌నగర్ వాసి

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

● అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్


సివిల్ సప్లయ్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వెంకటేశ్

గోల్నాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అధికారులకు సూచించారు. గోల్నాక తులసీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ అధికారులతో బుధవారం ఎమ్మెల్యే వెంకటేశ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబర్‌పేట నియోజకవర్గంలో పేద ప్రజలు అధికంగా ఉన్నారని, రేషన్ కార్డుల ఎంక్వైరీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ అపర్ణ, పౌరసరఫరాల శాఖ ఆరో సర్కిల్ అధికారి దీప్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తి కార్యక్రమాల్లో యువత పాల్గొనాలి

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్


షెడ్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపాల్

చిక్కడపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో జరిగే భక్తి కార్యక్రమాల్లో యువత పాల్గొనాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయ ఆవరణలో బుధవారం నూతన షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నిలయాలని, యువత ఆలయాలకు విచ్చేసి హైందవ సంస్కృతి, ధర్మం తెలుసుకోవాలన్నారు. తద్వారా వారిలో భక్తిభావం పెరుగుతుందన్నారు. భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఛైర్మన్ నర్సింగ్‌రావు, ఈఓ లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి: రామానుజులరెడ్డి


నాగమయ్యకుంటలో మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న డీఎంసీ రామానుజులరెడ్డి

రాంనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి ప్రజలకు సూచించారు. జీహెచ్ఎంసీ మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని నాగమయ్యకుంట బస్తీలో చెత్త, మట్టి కుప్పలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రేరణ, నాగమయ్యకుంట బస్తీ అధ్యక్షుడు సాయిలు, జీహెచ్ఎంసీ సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణణ్, జోనల్ కమిషనర్ రవికిరణ్ పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని బుధవారం డీఎంసీ రామానుజుల రెడ్డి, ఏఎంఓహెచ్ డా. ప్రవీణ పరిశీలించారు. ఆగస్టు 8 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని డీఎంసీ రామానుజులరెడ్డి తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● నల్లకుంట క్రైమ్ ఏఎస్ఐ మన్మోహన్


సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నల్లకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నల్లకుంట క్రైమ్ ఏఎస్ఐ మన్మోహన్ సూచించారు. నల్లకుంట డివిజన్‌లోని ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా సమీపంలోని పలు బస్టాపుల్లో విద్యార్థులు, ప్రయాణికులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, డయల్ 100పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరాల నియంత్రణకు నల్లకుంట పీఎస్ పరిధిలో ప్రజలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అపరిచితులకు ఓటీపీలు, ఆధార్ నంబర్ చెప్పకూడదని సూచించారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే లింక్‌లు క్లిక్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తామని చెప్పే వారి మాటలు, ప్రకటనలు అస్సలు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట పోలీసు సిబ్బంది మధు, శ్రీను, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

● కార్పొరేటర్ యాకర అమృత



మాట్లాడుతున్న కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. నల్లకుంట డివిజన్‌లోని రత్నానగర్, వెంకటేశ్వరనగర్ కమ్యూనిటీ హాల్స్‌లో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమృత మాట్లాడుతూ, పౌర హక్కుల రక్షణ బాధ్యత అధికారులదేనని అన్నారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సదరు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు తమ హక్కుల సాధన కోసం ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సకాలంలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట తహసీల్దార్ నయాబ్, హిమాయత్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్లు బలరాం, రఘు, విష్ణుకుమార్, జీహెచ్ఎంసీ ఏఈ శివశంకర్, ఏఎస్‌డబ్ల్యూఓ శాంతి, ఫుడ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, అధికారి ఐలయ్య, బీజేపీ నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్, బస్తీ వాసులు నర్సింగ్‌రావు, బాబు, శ్రీకాంత్, లక్ష్మణ్‌కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఫిలిం ఛాంబర్‌గా మార్చాలి

● రాంరెడ్డి డిమాండ్

బర్కత్‌పుర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఫిలిం ఛాంబర్‌ను తెలంగాణ ఫిలిం ఛాంబర్‌గా మార్చాలని సినిమా వేదిక రాష్ట్ర గౌరవ సలహాదారులు రాంరెడ్డి డిమాండ్ చేశారు. సినారె జయంతి వేడుకల్లో ఫిలిం ఛాంబర్‌లో జరిగిన గొడవపై బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరు సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ నటులు, కవులు, కళాకారులను గౌరవించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఈ రాష్ట్రానికి చెందిన కవులు, కళాకారులకు సరైన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఆంధ్ర వ్యక్తుల పెత్తనం కొనసాగుతుందని ఆరోపించారు. టీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రన్న, ప్రసాద్, యాదగిరి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నేడు టీయూసీఐ ధర్నా

చిక్కడపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఫర్ ఇండియా(టీయూసీఐ) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉదయం 11 గంటలకు ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కార్మిక కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు. టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎల్ పద్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ప్రవీణ్ కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నేత సాయిబాబా

బీసీల వ్యతిరేకి బీఆర్ఎస్

● టీడీపీ సీనియర్ నాయకుడు సాయిబాబా

రాంనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ బీసీల వ్యతిరేకి అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా విమర్శించారు. అధికారంలో ఉన్న పదేళ్లలో ఏనాడూ బీఆర్ఎస్ బీసీల ఊసెత్తలేదని ఆయన ఆరోపించారు. టీడీపీ నగర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థలలో రాజకీయ లబ్ధి కోసం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లు బీసీ రిజర్వేషన్లపై మాట్లాడుతున్నాయని ఆరోపించారు. అసెంబ్లీ తీర్మానం, ఆర్డినెన్స్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిషోర్, బాలరాజుగౌడ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


మిత్రను సత్కరిస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి రాధారాణి

మనిషిని పతాక స్థాయిలో నిలిపిన కావ్యం 'విశ్వంభర'

చిక్కడపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మనిషిని పతాకస్థాయిలో నిలిపిన కావ్యం విశ్వంభర అని, సినారె ఆ కావ్య రచనతో తెలుగు భాష కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లారని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయగానసభలో సినారె సంగీత పురస్కారం డీపే మిత్రకు పాతికవేల నగదు, జ్ఞాపికను అందించారు. పాట నిలిచి ఉన్నంత కాలం సినారె బతికే ఉంటారని రాధారాణి అన్నారు. కార్యక్రమంలో పార్వతీశం, డా. చెన్నయ్య, సీఎల్ఎన్ గాంధీ, వరప్రసాద్, వంశీరామరాజు, డా. సుధ, శైలజ, సుధామయి, గీతాంజలి, సురేఖ, వినోద్‌బాబు పాల్గొన్నారు.

డా.లక్ష్మణ్‌కు ఉపరాష్ట్రపతి అవకాశం కల్పించాలి

● బీజేపీ నేత సాయికృష్ణయాదవ్

రాంనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌కు ఉపరాష్ట్రపతిగా అవకాశం కల్పించాలని పార్టీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్ అధిష్ఠానాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, బీజేపీకి నాలుగు దశాబ్దాలుగా డా.కె.లక్ష్మణ్ సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. డా.కె.లక్ష్మణ్‌కు ఉపరాష్ట్రపతి పదవి కల్పిస్తే బీసీలంతా పార్టీకి అండగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు.

SUMMONS ISSUED UNDER SECTION 120 OF THE TELANGANA COOPERATIVE SOCIETIES ACT OF 1964.

Present Sri R. Ravi Chander, Assistant Registrar Field, Rajendranagar, O/o JR/DCO) Ranga Reddy District.

ARC NO 10/2024 Date: 24-07-2025

The Eenadu Cooperative Urban Bank Ltd., Chandanagar represented by its Managing Director, H.No. 2-57/4/1, A.K.Plaza, 1st Floor, Chanda Nagar, R.R.District, Hyderabad-50 ..... Plaintiff

And

1. **Cheruku Enterprises Represented by** Sri C.Srinivas Reddy, S-2, Malyadri Apartments, Road No. 12, Banjarahills, Hyderabad.
2. **Sri M.Chinna Redappa, S/o M.Lakshmaiah,** Plot No. 591, Vivekanandanagar Colony, Kukatpally, Hyderabad-500072.
3. **Sri P.Y.Kondal Rao,** Flat No.102, 1st Floor, Plot No. 1-7-121/E/19, Srinivasa Towers, Kamalanagar A.S.Rao Nagar, Hyderabad.

....Defendants

Whereas, the Eenadu Cooperative Urban Bank Ltd., Chandanagar has filed a reference Under Section 71(1) of the TCS Act, 1964 against Cheruku Enterprises and (2) others for the recovery of the amount of Rs. 47,68,648-as on 31-12-2006 with future interest due from the defendants.

You are here by summoned to appear before the undersigned either in person or through advocate on 14-08-2025 at 02-00 PM at the O/o the District Coop. Officer, Ranga Reddy District, 2nd Floor, Integrated District Office Complex, Kongara Kalan, Ibrahimpatnam (M), Ranga Reddy District with out fail.

You are further informed not to leave the premises of this court on the said day of hearing without permission of the undersigned. You are required to be present on the said date of hearing with such documents and witnesses on which you rely to dispute about your liability in this claim.

Take notice that this is a final chance and if you fail to attend the court on the aforesaid date, the claim shall be decided on the basis of the evidence adduced and shall be decided ex-parte.

Take notice that disobedience of summons amounts to punishment under Section 79 of TCS Act 1964.

ISSUED UNDER MY SEAL AND SIGNATURE ON THIS TWENTY FOURTH DAY OF JULY 2025

Arbitrator / Assistant Registrar/field
Rajendranagar O/o the District Cooperative Officer
Ranga Reddy District